క్లుప్తంగా

కలికిరిలో క్రీడలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ కరీముల్లా

కలికిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయి పాఠశాల క్రీడల పోటీలను శనివారం ఎంఈఓ కరీముల్లా, హెచ్ఎం శారద ప్రారంభించారు. త్రోబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా తదితర క్రీడల్లో పాల్గొనేందుకు ఆరు మండలాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 430 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ చాటిన వారంతా జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటారని ఎంఈఓ తెలిపారు.

పోషకాహారం పంపిణీ

మదనపల్లె: ప్రభుత్వ ఆస్పత్రిలో క్షయ వ్యాధిగ్రస్తులకు దాతల సహకారంతో పోషకాహార కిట్లు పంపిణీ చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్.పద్మాంజలీదేవి, ఆర్ఎంఓ ప్రసాదరాజు తెలిపారు. వారు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 60 మంది క్షయవ్యాధి రోగులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దయాలన్, సిబ్బాల ప్రభాకర్, సుశీల, వనజకుమారి, తరుణ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఈఈగా రాజశేఖరరెడ్డి బాధ్యతలు

రాజంపేట రూరల్: విద్యుత్‌శాఖ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)గా ఎస్ రాజశేఖర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. స్థానిక డివిజనల్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో శనివారం బాధ్యతలు చేపట్టిన రాజశేఖర్‌రెడ్డికి అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్‌లు ఘనంగా స్వాగతం పలికారు. మదనపల్లి ఈఈగా పనిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

క్రీడా స్ఫూర్తి అవసరం

రాయచోటిటౌన్: ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలని డీఈఓ శ్రీరాం పురుషోత్తం అన్నారు. శనివారం రాయచోటి నియోజక పరిధిలోని రాయచోటిలోని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాయచోటి, సంబేపల్లె, చిన్నమండెం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలకు చెందిన విద్యార్థులతో స్కూల్ గేమ్స్ నిర్వహించారు. ఈ క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు కబడ్డీ, ఖో- ఖో, బాల్ బ్యాడ్మింటన్, క్రికెట్ ఆటలను ఆయన ప్రారంభించారు.జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంతకుమారి, నియోజక వర్గ క్రీడా కోఆర్డినేటర్లు జగదీశ్వరయ్య, మనోహర్‌రెడ్డి, నరసనరాజు, హెచ్ఎం నరసింహారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

రాయచోటి అర్బన్ : దిగువ అబ్బవరంలోని ఎంఐజీ లేఅవుట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ము న్సిపల్ పాలకవర్గం, అధికారులు శనివారం సాయంత్రం పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, కమిషనర్ గంగాప్రసాద్, కౌన్సిలర్ ఈశ్వర్ ప్రసాద్ తదితరులు ఎంఐజీ లేఔట్‌లో చేపడుతున్న వాటర్‌ట్యాంక్ నిర్మాణం, బిటిరోడ్‌డ్రైన్‌ల పనులను పరిశీలించారు. పట్టణానికి సమీపంలో ప్రశాంత వాతావరణంలో అన్ని సదుపాయాలతో, ప్రభుత్వ అనుమతులతో, అతి తక్కువ ధరలతో ప్లాట్లు మధ్య తరగతి ప్రజలకు అందుబాటులోకి రావడం ప్రజలకు వరం అన్నారు. వైఎస్ఆర్‌సీపీ నేతలు సుగవాసి శ్యామ్, ఫయాజ్ అహమ్మద్, జానం రవీంద్ర, మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, పబ్లిక్‌హెల్త్ ఏఈ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

రజకులను కించపరిస్తే సహించేదిలేదు

రాయచోటి అర్బన్ : కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న రజకులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదని అన్నమయ్య జిల్లా రజకసేవాసంఘం అధ్యక్ష,కార్యదర్శులు టి.రమేష్‌బాబు, వి.శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. బెంగళూరు నగరానికి చెందిన ఒక మహిళా నాయకురాలు రజకులను కించపరుస్తూ మాట్లాడడడం బాధాకరమన్నారు. అధికారులు స్పందించి సదరు మహిళలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

అక్రమాలకు పాల్పడితే శిక్ష తప్పదు: ఆకేపాటి

ఓబులవారిపల్లె: అక్రమాలకు పాల్పడ్డ వారు ఎంతటివారైనా శిక్ష నుంచి తప్పించుకోలేరని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అరెస్ట్ అయ్యారన్నారు. అక్రమాలకు పాల్పడినట్లు అనేక ఆరోపణలు ఉన్నాయని, వాటిని విచారించిన అనంతరం సాక్ష్యాధారాలతో అరెస్టు చేశారన్నారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడికి నివాళి

ఓబులవారిపల్లె: మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఓబిలి గంగిరెడ్డి(87) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి మృతుని కుమారులు మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, సుధీర్ కుమార్ రెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం గంగిరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. రాష్ట్ర నాయకులు ముక్కా రాపానందరెడ్డి, పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలే వైఎస్సార్‌సీపీకి బలం

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



కురబలకోటలో నాయకులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

కురబలకోట : ప్రజలు, కార్యకర్తలే వైఎస్సార్‌సీపీకి ప్రధాన బలమని, రానున్న ఎన్నికలకు ఇప్పటినుంచే సమాయత్తం కావాలని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పిలుపునిచ్చారు. కురబలకోట మండలంలో జరిగిన పల్లెబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల వారీగా నాయకులతో సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లె బాటలో వచ్చిన ప్రతి వినతిని బాధ్యతగా పరిష్కరించాలన్నారు. టీడీపీ, జనసేన పొత్తు అధికారం కోసం ఆరాటమేనన్నారు. గతంలో సీఎంగా ఉన్న చంద్రబాబు రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ చేయకుండా నిలువునా మోసం చేశాడని, ఇప్పుడు కల్లబొల్లి కబుర్లు చెబితే జనం నమ్మే పరిస్థితి లేదన్నారు. సీఎం జగన్ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రబల శక్తిగా మారిందని, ఏ కూటమితో తమకు పనిలేదన్నారు. అన్ని వర్గాలను సమదృష్టితో చూడడంతో అందరి ఆదరాభిమానాలు జగన్ ప్రభుత్వానికి ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బైసాని చంద్రశేఖరరెడ్డి, బి.దస్తగిరి, ఎస్వీఆర్, పోరెడ్డి విశ్వారెడ్డి, ఆర్కే.కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి, కొరివి జగన్నాథరెడ్డి, రవీంద్రారెడ్డి, ఆనందరెడ్డి పాల్గొన్నారు

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

కురబలకోట : నియోజకవర్గంలోని ఐదుగురికి సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి శనివారం అందజేశారు. బి.కొత్తకోట మండలం కోటిరెడ్డిగారిపల్లెకు చెందిన ప్రమీలకు రూ.4 లక్షలు, బి.కొత్తకోటకు చెందిన పటాన్ హుర్రైన్‌కు రూ.1.5 లక్షలు, కురబలకోట మండలం నందిరెడ్డిగారిపల్లెకు చెందిన ఎస్.మస్తాన్‌వలికి రూ.1.2 లక్షలు, పీటీఎం మండలం అంకిరెడ్డిపల్లెకు చెందిన టి.రమణమ్మకు రూ.20 వేలు, బడికాయలపల్లెకు చెందిన బీఎస్.పవిత్రకు రూ.40 వేల చెక్కులను అందజేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ భరోసానిస్తుందన్నారు. అర్హులైన వారు నిర్దేశిత గడువులోగా తమ వైద్య ఖర్చులపై తన దృష్టికి తెస్తే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటామన్నారు.

సంక్షేమ రారాజు జగనన్న



పెద్దతిప్పసముద్రంలో పల్లెబాట

పెద్దతిప్పసముద్రం: రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ పథకాలు అమలు చేస్తూ సంక్షేమ రారాజుగా సీఎం వైఎస్ జగనన్న ఖ్యాతి గడించారని ప్రజా ప్రతినిధులు, నాయకులు మహమూద్, సుబ్బరాం, శివన్న, డ్రిప్ రమణ, పట్టెరిక శోభ, శంకర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం పల్లె బాట కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ టీడీపీ పాలనలో పక్కా గృహం, పింఛన్ మంజూరు కావాలంటే ఏళ్ల కొద్దీ అధికారులు, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో వలంటీర్లే ఇళ్ల వద్దకు వచ్చి పథకాల ప్రయోజనాలు వివరించి దరఖాస్తు చేయిస్తున్నారన్నారు. జగనన్న పాలనలో తామంతా సంతోషంగా ఉన్నామని పలువురు అభిప్రాయం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తమక శంకర్, రియాసత్ అలీఖాన్, చంద్రశేఖర్, ఖాదర్‌వలి, ధనలక్ష్మి, అయూబ్ ఖాన్, సాదిక్, నారాయణ, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

మదనపల్లె: వినాయ చవితికి కొబ్బరి మట్టలు తెచ్చేందుకు చెట్టు పైకెక్కిన యువకుడు జారి కింద పడడంతో గాయాలయ్యాయి. ఈశ్వరమ్మ కాలనీకి చెందిన కుమార్(30) కొబ్బరిచెట్టు ఎక్కి మట్టలు కత్తిరిస్తుండగా..ప్రమాదవశాత్తూ జారి కిందపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని ఆస్పత్రికి తరలించారు.

21 నుంచి సదరం శిబిరాలు

మదనపల్లె: ఈ నెల 21, 23వ తేదీల్లో మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో సదరం శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్.పద్మాంజలీదేవి తెలిపారు. తన కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ...సదరం ధ్రువపత్రం లేనివారికోసం అన్నమయ్య జిల్లా పీలేరు, రాయచోటి, రాజంపేట ఆస్పత్రుల్లో 20న, మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో 21న పీలేరు, రాయచోటి, రాజంపేట ఏరియా ఆస్పత్రుల్లో 23న నిర్వహిస్తామన్నారు. మూగ, చెవిటి, కంటి సమస్యలు, మానసిక వికలాంగులు ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఆర్ఎంఓ డాక్టర్.పి.ప్రసాద్‌రాజు, ఆర్థోపెడిక్ డాక్టర్.జ్ఞానేశ్వర్, చీఫ్ బయోకెమిస్ట్ డాక్టర్.కే.శ్రీనివాసులు పాల్గొన్నారు.

డీఈఈల నియామకం

మదనపల్లె: మదనపల్లె పురపాలక సంఘం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు(డీఈఈ)గా గోపీనాథ్, ప్రకాష్‌లను నియమిస్తూ తాడేపల్లి పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆనందరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతుల్లో భాగంగా విడుదల చేసిన ఉత్తర్వుల్లో నంద్యాల మున్సిపాలిటీలో అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ)గా పనిచేస్తున్న జి.ప్రకాష్, రాయదుర్గం మున్సిపాలిటీలో ఏఈగా పనిచేస్తున్న కే.గోపీనాథ్‌ను మదనపల్లె మున్సిపాలిటీకి కేటాయించారు. కీలకమైన ఈ రెండు డీఈఈ పోస్టులు ఖాళీగా ఉండటంతో ఎన్విరాన్‌మెంటల్ ఏఈ బండపల్లిశిరీష ఇన్‌చార్జ్ డీఈగా వ్యవహరించారు. పదోన్నతుల్లో భాగంగా ఇద్దరు డీఈఈలను కేటాయించడంతో అభివృద్ధి పనులు త్వరితగతిన జరిగేందుకు అవకాశం ఉంది.

డంపింగ్ యార్డుకు పదెకరాల స్థలం



దంపిగ్ యార్డు స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జి.వి.శ్రీనాథరెడ్డి

పీలేరు: పీలేరు పంచాయతీలో డంపింగ్ యార్డుకు పది ఎకరాల స్థలం ప్రభుత్వం కేటాయించినట్లు మాజీ ఎమ్మెల్యే జి.వి.శ్రీనాథరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గూడరేవుపల్లె పంచాయతీలో యార్డుకు కేటాయించిన స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీలేరు పంచాయతీ సిబ్బంది రోజూ సేకరించిన చెత్త వేయడానికి స్థలం లేక ఇబ్బందిపడ్డారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారంతో స్థలం కేటాయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, హుమయూన్, చలపతి, శ్రీనాథరెడ్డి, జయపాల్‌రెడ్డి, అబీద్, రమణ, కాలేషా పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రతి ఒక్కరికీ వైద్యం



కలకడ పీహెచ్‌సీలో రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ దేవ, డీఎంఅండ్‌హెచ్ఓ కొండయ్య

కలకడ: ప్రతి వ్యక్తికి జగనన్న సురక్ష యోజన పథకం కింద వైద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ దేవ అన్నారు. మండలంలోని కలకడ పీహెచ్‌సీని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్లు, ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి అందరి ఆరోగ్య సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రోగుల సమాచారం తెలుసుకుని ప్రత్యేక విభాగాలకు సిఫారసు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్ హెచ్ఓ కొండయ్య, డాక్టర్ మల్లికార్జున, మోహన్ జయరాం, రామక్రిష్ణ, హెచ్ఈ రాజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మరిన్ని వైద్య సేవలు



మాట్లాడుతున్న డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్

కలికిరి: ఆయుష్మాన్ భవ కింద పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మెన్ సతీష్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన అయుష్మాన్ భవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులు, సిబ్బంది ఆసుపత్రికి వచ్చే రోగులకు అవగాహన కల్పించి సేవలను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన

కలికిరి: రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డా.ఎం.మల్లికార్జున రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి సూచించారు. కేవీకే కార్యాలయాన్ని శనివారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు మరింత ఉపయోగకరమైన సేవలు అందించాలని కోరారు. అనంతరం కేవీకేలోని సమగ్ర కోళ్లు, గొర్రెల పెంపకం , వర్మీ కంపోస్టు యూనిట్, నర్సరీలోని అంటు మొక్కలు, మునగ, చీనీ పెంపకం పరిశీలించారు. సమాచార, భూసార పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఎస్సీ ఉప ప్రణాళికలో భాగంగా రైతులకు బ్యాటరీ పిచికారీ యంత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే కో-ఆర్డినేటర్ డా.పాండురంగ, శాస్త్రవేత్తలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు బ్యాటరీ పిచికారీ యంత్రాలే అందజేస్తున్న పాలక మండలి సభ్యులు

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడే అర్హత, స్థాయి జనసేన నాయకుడు తాతంశెట్టి నాగేంద్రకు లేదని శనివారం జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి, పట్టణ అధ్యక్షుడు సిహెచ్.రమేష్, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, తొండం రాజేంద్ర, నందాబాలా, శ్రీరామ్‌వినోద్ తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఎంత అభివృద్ధి చేశారో జనసేన నాయకులు కళ్లు పెట్టుకుని చూడాలన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక 1200 కోట్ల రుపాయలతో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సంక్షేమ, అభివృద్ధి పనులు చేశారన్నారు. నియోజకవర్గంలో పూర్తయిన రోడ్లు, వాటర్‌ట్యాంకులు, బ్రిడ్జిలు, బీటీ రోడ్లు, సీసీరోడ్లు, భవనాలు , అభివృద్ధి చెందిన పాఠశాలలు కనబడలేదా అన్నారు. జనసేన నేత ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నారు.

ఏపీలోనే అత్యధిక పింఛన్లు

పీలేరు ఎమ్మెల్యే చింతల.రామచంద్రారెడ్డి



కలకడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలకడ: దేశ వ్యాప్తంగా ఏపీలోనే అత్యధిక పింఛన్లు మంజూరు చేశారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 325 మందికి శనివారం నూతన పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛను మంజూరు చేస్తున్నారన్నారు. టీడీపీ కార్యకర్తలకు కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతను బట్టి సంక్షేమ పథకాలు వచ్చాయని గుర్తు చేశారు. కలకడ మండలంలో నెలవారీ 5,585 మందికి మొత్తం వృద్ధాప్య, వితంతు, వికలాంగ, పింఛన్ల రూపంలో రూ.1,52,04,750లు వలంటీర్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, వెంకటరమణారెడ్డి, కమలాకర్‌రెడ్డి, ఈశ్వర్‌నాయుడు, హరినాథరెడ్డి, రవికుమార్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, శాంతమ్మ, రామచంద్ర, మోహన్‌రాజ్, నల్లమ్మ, క్రిష్ణారెడ్డి, పురుషోత్తంనాయుడు, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం

వాల్మీకిపురం : ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తున్నాయని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పేదలు దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బంది పడకుండా మండల స్థాయిలోనే అన్ని వసతులతో కూడిన వైద్యం లభిస్తోందన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద వైద్యం పొందిన ప్రతి రోగి ఆరోగ్య విషయాలను తమ కార్డులో పొందుపరుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ నాయకులు రవికుమార్ రెడ్డి, చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్, శ్రీధర్‌రాయల్, రాయుడు, ఆనంద, సత్య, శివారెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు వస్తే వలంటీరు వ్యవస్థ రద్దు చేస్తారు

గుర్రంకొండ : చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే వాలంటీర్ వ్యవస్థ రద్దు చేస్తాడని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. తెలుగు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో 324 మందికి నూతన పింఛన్లు శనివారం పంపిణీ చేశారు. అనంతరం సేవారత్న, సేవామిత్ర, సేవావజ్ర పురస్కారాలు పొందిన వాలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. ప్రతి కుటుంబానికి కనిష్టంగా రూ.4లక్షల నుంచి గరిష్టంగా రూ.10 లక్షల వరకు లబ్ధి చేకూరుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సమ్రీన్ ముక్తియార్, జయచంద్రారెడ్డి, నాగేంద్ర, నక్కాచంద్రశేఖర్, కందుల గుణశేఖర్, అప్పల్ల, రమణ, జమీర్ ఆలీఖాన్, రెడ్డికుమార్ సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర..రక్షణ కవచం



ఓ 3 ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

మదనపల్లె సిటీ : సూర్యుని నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాలు భూమి మీదకు చేరకుండా ఓజోన్ పొర సమస్త జీవకోటికి రక్షణ కవచంగా ఉందని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం స్థానిక పాఠశాలలో అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పల్లెల నుంచి పట్టణాల వరకు మోటారు వాహనాలు పెరగడం, పరిశ్రమల కాలుష్యం, అధికశాతం మంది ఏసీలను వినియోగించడంతో ఓజోన్‌పొరకు ప్రమాదం ఏర్పడిందన్నారు. అనంతరం విద్యార్థులు ఓ 3 ఆకారంలో ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, ఫణీంద్ర, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు జెడ్పీ పాఠశాలలో శనివారం అంతర్జాతీయ ఓజోన్ డే నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఓజోన్ మూలకం రూపంలో విద్యార్థులు కూర్చుని ఐక్యత చాటారు. ఓజోన్ పొరపై ప్రజలకు అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి

వాల్మీకిపురం : ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత అని ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి అన్నారు. కళాశాలలో శనివారం ప్రపంచ ఓజోన్ డే వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ భూమిని ఆవరించి ఉన్న ఓజోన్ పొర మానవాళికి రక్షణ కవచంలా ఉందన్నారు. అనంతరం విద్యార్థులు ఓజోన్ యొక్క ప్రాముఖ్యతను పోస్టర్ ద్వారా వివరించారు. దీంతో పాటు చింతపర్తి జడ్పీ, పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లోనూ జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ ఆధ్వర్యంలో ఓజోన్ డే వేడుక నిర్వహించారు. పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దప్పరాజు, నారాయణస్వామి, రెడ్డెప్ప రెడ్డి, సావిత్రి, రవీంద్రారెడ్డి, సువర్ణ, నాగరాజు, శేఖర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయకచవితి కోలాహలం



కంటేవారిపల్లెలో వినాయక ప్రతిమలు

కురబలకోట: చవితి వేడుకలకు ఊరూ వాడ సిద్ధమైంది. యువకులు పందిళ్లు, మండపాలు వేయడంలో తలమునకలయ్యారు. వినాయక ప్రతిమలతో ఏటా వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. నిరుటి కన్నా ఈ ఏడాది భారీ వినాయక ప్రతిమలు వివిధ రూపాల్లో చూపరులను కనువిందు చేస్తున్నాయి. రేటు ఎక్కువైనా అవే కావాలంటూ యువకులు బేరసారాలు చేస్తున్నారు. జై బోలో గణేష్ మహరాజ్‌కి జై..అంటూ విగ్రహాలను వాహనాల్లో గ్రామాలకు తరలిస్తున్నారు.

పోలీసుల అనుమతి తీసుకోవాలి

నిమ్మనపల్లె: వినాయక విగ్రహ మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మండపం ఏర్పాటు చేసే వారి వివరాలను పోలీస్‌స్టేషన్‌కు అందజేయాలన్నారు. పబ్లిక్, ప్రైవేట్ స్థలాల్లో వేడుక చేసుకునే వారు ఆయా విభాగపు అధికారులు, సంస్థల యజమానుల అనుమతి తీసుకోవాలన్నారు. ప్రతిమల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, మార్గం వివరాలను విధిగా తెలపాలన్నారు. నిరంతరం కాపలా, తాత్కాలిక సీసీ కెమెరాలు కమిటీలు సొంతంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బ్యానర్లు, ఫ్లెక్సీలతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పల్లెల్లో ఊరేగింపు సమయంలో డీజే ప్రదర్శన నిషేధమని తెలిపారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

పీలేరురూరల్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గణేష్ విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లను స్థానిక కడప రోడ్డులోని అయ్యప్పనాయునిచెరువు వద్ద సీఐ మోహన్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా పరిశీలించారు. వారు మాట్లాడుతూ నిమజ్జనానికి వాహనాలు వెళ్లడానికి వీలుగా జేసీబీతో చదును చేపడుతున్నట్లు తెలిపారు. భాస్కర్‌రెడ్డి, రమణ, మోహన్ రెడ్డి, శ్రీధర్, సుబ్రమణ్యం, గిరి పాల్గొన్నారు.

నేడు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

మదనపల్లె సిటీ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆదివారం మట్టి వినాయక ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్ధిక్ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదుట ఉన్న సంస్థ కార్యాలయంలో వినాయకుడి ప్రతిమలతోపాటు అందరికీ మొక్కలు పంపిణీ చేస్తామన్నారు.

పల్లె తలుపు తట్టి.. ప్రజల నాడి పట్టి..!

- ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామీణులకు అత్యుత్తమ వైద్యం
- నెలలో రెండు సార్లు ఇంటింటా వైద్య సేవలు



రోగులను పరీక్షిస్తున్న 104 వైద్యులు

మదనపల్లె సిటీ : ప్రభుత్వం పేదల వైద్య సంరక్షణకు పెద్దపీట వేసింది. పల్లె తలుపు తట్టి వైద్యులే ఇంటింటా తిరిగి ప్రజల నాడిపట్టేలా ఏర్పాట్లు చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం కల్పించింది. ఇప్పటికే ఆరోగ్యశ్రీ, 104, తల్లీ, బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లతో సేవలందిస్తున్న ప్రభుత్వం తాజాగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రజల వద్దకే వెళ్లి వైద్యం అందిస్తోంది. మంచానికి పరిమితమైన వృద్ధులు, వికలాంగులు, ఆరోగ్యశ్రీ రోగులను పరామర్శిస్తూ ఇంటి వద్దే సేవలదిస్తున్నారు. దీంతో పాటు మధ్యాహ్నం ఆయా గ్రామాల్లోని అంగన్వాడీ, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో తమకు ఇబ్బందులు తప్పాయని గ్రామీణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నా పేరు బి.నరసింహులు. మదనపల్లె మండలం జంగాలపల్లె. నేను కాళ్ల నొప్పులు, ఆయాసంతో బాధపడుతున్నా. వయస్సు 76. మదనపల్లెలోని ఆస్పత్రులకు వెళ్లాలంటే కష్టం. వయస్సు మీరడంతో దూరంగా వెళ్లి ఆస్పత్రులకు చూపించుకోవాలంటే కష్టంగా ఉండేది. ఇప్పుడు 104 వాహనం నెలకు రెండు సార్లు వస్తోంది. డాక్టరే స్వయంగా చూస్తున్నారు. దీంతో ఆరోగ్యం కుదుటపడుతోంది. మాలాంటి వృద్ధులకు సకాలంలో వైద్యం అందుతోంది. ప్రభుత్వం మేలు మరువలేం.



నా పేరు భారతి. మదనపల్లె మండలం మద్దినాయునిపల్లె. కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నా. నాకు షుగర్ ఉంది. గతంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి మందులు తెచ్చుకునేదాన్ని. ప్రస్తుతం 104 ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామంలోనే మందులు ఉచితంగా ఇస్తున్నారు. ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మాలాంటి వారికి మేలు జరుగుతోంది. మాకు ఖర్చులు, ఇబ్బందులు తప్పాయి. పేదవారిని ఆదుకోవడం సంతోషంగా ఉంది.



నా పేరు శాంతమ్మ. మదనపల్లె మండలం వేంపల్లె దళితవాడ. 62 సంవత్సరాలు. ప్రమాదంలో కాలు విరగడంతో మంచానికే పరిమితమయ్యాను. 104 వాహనం సిబ్బంది మా ఇంటికి వచ్చి అన్ని పరీక్షలు చేసి మందులిచ్చారు. ప్రభుత్వ వైద్యులు మా ఇంటికి వచ్చి వైద్య సేవలు చేశారు.